# సాగనిస్తే పైచెయ్యే

-కందుకూరి వెంకట మహాలక్ష్మి

అర్చన ఆఫీసులో మర్చిపోయిన బ్యాగ్ ఇచ్చి వెళ్దామని స్కూటర్ లాక్‌చేసి అర్చన ఇంటిలోకి వెళ్ళాడు వినీత్. లోపలి నుంచి వినిపిస్తున్న కేకలకి గుమ్మం దగ్గరే నిలబడిపోయాడు వినీత్.

"ఎక్కడికి తగలడ్డావే ముదనష్టపుదానా! ఇంతసేపెక్కడ తిరిగావే– ఆ వినీత్‌గాడితోనేనా ఆ తిరుగుడు? నేనింకెలాగా పనికిరానివాడిననేగా నువ్వు వాడితో అడ్డమైన తిరుగుళ్ళూ, ఇష్టమొచ్చినట్టు తిరుగుతున్నావు" అంటూ పెడుతున్న ప్రభు కేకలకి–

"లేదండీ, మార్కెట్‌కెళ్లి కూరలు తెచ్చాను" అంటున్న అర్చనతో "ఛీ నోరు ముయ్, బాగా పొగరెక్కిపోయావు. ఏం చూసుకుని ఆ అహంకారం. నీకున్నదేమిటి? అందమే కదా! అది చూసుకునే కదా నీకు అంత గర్వం. ఆ అందంతోటే మగాళ్ళని ఆకర్షించి, నీ కోరికలు తీర్చుకుని, డబ్బు సంపాదిస్తున్నావు. లేదంటే నీకెక్కడిదే నా ఆస్పత్రి ఖర్చూ, మందుల ఖర్చు డబ్బూనూ. నామీదెంతో ప్రేమున్నట్టు నటిస్తూ, వైద్యం చేయించడానికి వాడితో తిరిగి తెచ్చావు కదూ! లేదంటే వాడెందుకంత డబ్బు ఇస్తాడూ? పైగా వాడెందుకా ఆఫీసులోనే నీకు ఉద్యోగం వేయించాడూ? వాడి స్కూటర్ మీద రావడం చూస్తే ఎవరేమనుకుంటారో అని సిగ్గుందా నీకు? దౌర్భాగ్యురాలా! నేనేమయిపోయినా నీకింక లోటు లేదులే" అంటూ వెటకారంగానూ, కోపంగానూ ప్రభు పెడుతున్న కేకలు విన్న వినీత్‌కి కాళ్ళ క్రింద భూమి గిర్రున తిరుగుతున్నట్లనిపించింది. వాడి కేకలకి అర్చన నోటమ్మట ఒక్క మాట రాలేదు.

నిజానికి అర్చన ఎంతో నెమ్మదస్తురాలు. మనిషి చక్కగా ఉంటుందని, కావాలని చేసుకున్న ప్రభు ఇప్పుడు ఆమె అందాన్ని చూసి ఈర్ష్యపడటమేమిటి? తను సంసార జీవితానికి పనికిరాకపోవడం వల్ల తనొక్కడే దురదృష్టవంతుడా? పాతికేళ్ళు నిండని ఆమె జీవితమంతా అడవికాచిన వెన్నెల కాలేదా? ప్రభు తనవైపు నుంచే కాకుండా అర్చన వైపు నుంచెందుకు ఆలోచించటంలేదూ?

వినీత్‌కి యింక అక్కడ ఒక్క నిమిషం కూడా నిలబడాలనిపించలేదు. వెనుదిరిగి తన రూంకి వచ్చేశాడు. తల తిరిగిపోతోంది. పిచ్చివాడిలా ఆలోచిస్తూ మంచం మీద వాలాడు.

ప్రభూ, వినీత్ మంచి స్నేహితులు. ఇద్దరూ ఒకే ఆఫీసులో ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రభు పెళ్ళయి ఏడాదయినా కాలేదు, కారు గుద్దేసి వెన్నెముక దెబ్బ తింది. రెండు నెలలు ఆస్పత్రిలో ఉండి ఇంటికొచ్చాడు. ఆ ఆపరేషన్ తరువాత రెండు కాళ్ళూ చచ్చుబడిపోయాయి. వెన్నెముక దెబ్బతినడంతో లేచి కూర్చోను కూడా కూర్చోలేడు. మంచం మీదే అన్నీ జరుగుతాయి.

వినీత్ రోజూ ఇంటికి వచ్చి, ప్రభుకి కావలసినవి చూసి, మందులవీ తెచ్చి, కాస్సేపు కబుర్లు చెప్పి వెళ్తూ ఉంటాడు.

ప్రభు భార్య వినీత్‌ని 'అన్నయ్యా!' అని సంబోధిస్తుంది. ఆ ఇంట్లో వినీత్ సొంత వ్యక్తిలా తిరుగుతాడు. పెళ్ళయిన దగ్గర నుంచీ ఎక్కడికెళ్ళినా ముగ్గురూ కలిసే వెళ్ళేవారు. సొంత చెల్లెలికన్నా ప్రేమగా అర్చనని చూసుకుంటాడు వినీత్. అలాంటిది తనమీద ప్రభుకి ఇంత నీచమైన అభిప్రాయమా? ప్రభు ఎందుకలా మాట్లాడుతున్నాడు? ఎందుకలా మారిపోయాడు? ఇప్పటికీ తనెదితే మామూలుగా మాట్లాడతాడే! మరి అర్చనతో తన గురించెందుకలా మాట్లాడేడు?

ప్రభు ఆరోగ్యం దెబ్బతిన్నాకా అదే ఆఫీసులో అర్చనకి ఉద్యోగం ఇచ్చారు. అది కూడా వినీత్ గట్టి ప్రయత్నం వల్లే– అర్చన ఇంట్లో కూర్చుంటే వాళ్ళకి జీవనోపాధి కష్టమని అతను చేసిన ప్రయత్నం ఫలించింది.

ఇంట్లో అన్నీ భర్తకి చేసి ఆఫీసుకొస్తుంది. తిరిగి ఇంటికెళ్ళి భర్తకి అన్నీ చూసుకుంటుంది. ఆఫీసులోనూ, ఇంట్లోనూ క్షణం తీరిక లేకుండా చాకిరీ చేసే అర్చన మీదే యిలాంటి నిందలెయ్యడం!! అందునా పెళ్ళికి ముందునుంచే ప్రాణంలా కలిసి మెలిసి తిరిగే తనతోనే చెడు సంబంధాన్ని అంటగడతాడా? ఎంత దురదృష్టకరం!

ఇందుకేనన్నమాట అర్చన ఈ మధ్య తనని తప్పించుకుని తిరుగుతోంది. తనతో ముభావంగా ఉండటానికి కారణం ఇప్పుడే అర్థమవుతోంది. మొదట్లో తన స్కూటర్ మీద దింపుతానంటే వచ్చేది. ఈ మధ్య

మార్కెట్‌కి వెళ్ళాలనో, ఆఫీసు పనింకా అవలేదనో తప్పించుకుంటోంటే అర్థమయ్యేది కాదు. ఇప్పుడే దానికి కారణం తెలుస్తోంది.

అర్చనకి దేముడు చేసిన అన్యాయం కంటే భర్త పెట్టే ఈ చిత్రహింసలు మరీ దారుణమైనవి. ఇదిలా కొనసాగితే అర్చన జీవితం ఏమవుతుంది? ప్రభుగాడి కింక బుద్ధిరాదు. పైగా ఆమెనలా హింసిస్తూనే ఉంటాడు. వాడు భార్యని హింసించి తన అనారోగ్యాన్ని తగ్గించుకుంటున్నాడా? ఇలా సైకిక్‌లా తయారయ్యాడా? అన్ని మాటలు భర్త అంటున్నా ఆమె నోటంట ఒక్కమాట వినపడలేదు. ఇంత దావాగ్నిని కడుపులో పెట్టుకుని ఎలా బ్రతుకుతోంది అర్చన?

పెళ్ళయిన కొత్తలో ఆ జంటని చూసి అంతా ఎంతో ముచ్చటపడేవారు. ఎవరి దృష్టి తగిలిందో!

ప్రభు తన్ని రోజూ ఇంటికి తీసుకెళ్ళి నా ఫ్రెండుకి ఇదిష్టం, అదిష్టం అని ఎన్నో వంటకాలు చేయించి పెట్టేవాడు. ఇంట్లో ఏ సామాను కొనాలన్నా, ఏం చెయ్యాలన్నా తన సలహా తీసుకునేవాడు. వారానికి రెండు మూడు రోజులు వాళ్ళింట్లో భోంచెయ్యందే వదిలేవాడు కాదు. అలాంటి ప్రభు మనస్సులో ఇంత నీచమైన ఆలోచన ఎలా దాగుంది? మరి ఇప్పటికీ తను వాళ్ళింటికెళ్తే ఎంతో అభిమానంగా మాట్లాడతాడే! ఇవాళ వాడాడిన మాటలకి, తనను పలకరించే పలకరింపులకీ ఎక్కడా పొంతన లేదేమిటి? అంటే వాడికి పెళ్ళాంమీదుండే కసిని ఇలా ఏదో వంక పెట్టి తీర్చుకుంటున్నాడా? అనారోగ్యం వాడినింత దిగ జార్చిందనన్నమాట. దీనికేదన్నా మార్గం ఆలోచించాలి. లేదంటే అర్చన జీవితం నరకమే అవుతుంది. అది ఎలా పరిణమిస్తుందో తెలీదు అంటూ ఆలోచించ సాగాడు.

మర్నాడు ఆఫీసుకొచ్చిన అర్చనకి బ్యాగ్ అందిస్తూ "అర్చనా, నిన్న సాయంత్రం బ్యాగ్ ఇద్దామని మీ ఇంటికి వచ్చాను. కానీ లోపలికి రాలేకపోయాను" అన్న వినీత్ మాటలకి తలదించుకుంది అర్చన. "అర్చనా! అలా క్యాంటీన్‌కెళ్ళి కాఫీ తాగి వద్దాం పద" అంటూ ఆమెని బలవంతాన క్యాంటీన్‌కు తీసుకెళ్ళి రెండు కాఫీలకి ఆర్డరిచ్చాడు వినీత్.

"చూడు అర్చనా! నిన్న ప్రభు ఆడిన మాటలన్నీ విన్నాను. నేను నీ గురించి అంతా గ్రహించాను. నీ ఓర్మి, శాంతం వాడిని మార్చుతుందనుకుంటున్నావా? నువ్విలాగే ఉంటే వాడు మారడు. ఇదోరకం జబ్బు. వాడి మందులకీ, ఆస్పత్రి ఖర్చులకీ నేను డబ్బిచ్చానని వాడికీ తెలుసు. అది వాడితో నాకుండే స్నేహానికి నేను ఖర్చుపెట్టాను. దీన్ని వాడు వక్రంగా సృష్టించి మాట్లాడేదు. ఇలా నువ్వు ఊరుకుంటోంటే వాడి ధోరణి ఎక్కువవుతుందే గానీ తగ్గదు. అది వాడికోరకమైన పిచ్చి అనాలి. సైకిక్‌లా తయారయ్యాడు. వాడి అనారోగ్యాన్ని కసిగా మార్చుకుని లోకువైన నీ మీద ఇలా తీర్చుకుంటున్నాడు. ఈ పిచ్చి ముదరడమే కాదు, ఇంకా ఎక్కువయి నిన్ను బాధపెడతాడు. నువ్వు నాకు చేయూతగా ఉంటే నేనతణ్ణి బాగు చేయిస్తాను. నా

## అందరిలో ఒంటరిగా...

మౌనంగానే అయినా
హృదయం అప్పుడప్పుడూ
దిగులుగానే ఉంటుంది ఎందుకో?
    అన్నీ ఉంటాయి
    హాస్యం, వీరం, కరుణా క్రోధం
    స్నేహం ప్రేమ దృగ్గిపి
    ఎక్కడో రవ్వంత దుఃఖం
    గుండె అంచుకు వేలాడుతూ...
శ్వాసల్లో పరిమళం
జ్ఞాపకాల్లో చిలిపితనం
తెరలు తెరలుగా స్వప్న సోపానాలు
యుగ సముద్రంలో నిరీక్షణా నావ
చెట్టుకింద కూడ ఉక్కపోత...
    పలకరించే వారూ
    ప్రశంసించేవారూ
    స్పర్శించి ప్రేమ వెచ్చన తెల్పేవారూ
    ఆనందంతో కౌగిలించేవారూ
    అయినా ఏదో కొరత సూదిలా గుచ్చుకుంటూ...
పేరు పేరునా అందరూ
అన్నీ తెలిసిన ముఖాలే
మాట్లాడుతూనే ఉంటాం
వెతలు విప్పుకుంటాం
బతుకు చెప్పుకుంటాం
బాధలు పంచుకుంటాం
ఒాక యేకాకితనం మాత్రం
సాయంత్రపు నీరెండలో నీడలా
వెన్నాడుతూనే ఉంటుంది!

–ఈతకోట సుబ్బారావు

మాట విను. నేను చెప్పినట్లు నడుచుకో" అంటున్న వినీత్‌ని చూసి "అలాగే అన్నయ్యా! నాకిదో నరకం లాగుంది. ఇంటికెళ్ళాలంటే భయంగా ఉందన్నయ్యా!" అంటూ విలపిస్తున్న అర్చనని ఊరడించి లేచారిద్దరూ.

వినీత్ మాటల్ని విన్న సైకాలజిస్టు కూడా ప్రభుకి తెలీకుండా ఆస్పత్రికెళ్ళిన రోజున అతన్ని టెస్టుచేసి, కొన్ని మందులు రాసిచ్చి, మర్నాడు వినీత్‌తో ఏదో మాట్లాడేడు. వినీత్ 'సరే' అని మామూలుగా, ఇదివరకు లాగే ప్రభు దగ్గరకి వెళ్ళి సాయంకాలాలు కొద్దిసేపు గడిపి వస్తున్నాడు. ప్రభు కూడా వినీత్ వచ్చినప్పుడు సరదాగా కబుర్లు చెప్పి, కాస్సేపు తన అనారోగ్యాన్ని గురించి చెప్పి బాధపడేవాడు.

అలా ఓ రోజు వచ్చిన వినీత్‌ని చూసి ప్రభు బోరుమని ఏడవటం ప్రారంభించాడు. "అదేంట్రా, ఈరోజిలా దుఃఖిస్తున్నావు. ఏమయింది? ఏదన్నా ప్రాబ్లమా?" అని అడగ్గానే "ఒరేయ్ వినీత్! వీధి తలుపు వేసిరారా. నీతో నా కడుపులో ఉన్న బాధల్ని చెప్పుకోవాలి" అంటున్న ప్రభు మాటలకి తలుపేసి వచ్చి "అర్చన యింట్లో లేదా?" అని అడిగిన దానికి "అది ఈ మధ్య ఆఫీసయిపోయినా రాత్రి ఎనిమిదీ, తొమ్మిదీ దాటితేగానీ ఇంటికి రావడంలేదురా. కారణం అడిగితే గయ్‌మని లేస్తోంది. పైగా కొద్ది రోజులుగా కొన్ని ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. ఏమిటో తెల్సా? అర్చన ఆఫీసులో ఎవరితోటో సంబంధం పెట్టుకుందిట. ఏమిటో అయోమయంగా ఉందిరా నా బ్రతుకు" అంటూ గోలపెడుతున్న ప్రభుని ఊరడించి– "ఒరే ప్రభూ! అంత అనురాగంతో ఉండే మీ దంపతుల మధ్య ఇలాంటి విభేదాలెందుకొచ్చాయిరా? ఒక్క విషయం అడుగుతాను చెప్పు. నువ్వుగానీ అర్చనని ఏదన్నా అంటున్నావా? లేదంటే నువ్వంటే అంత ప్రాణంగా ఉండే అర్చన మరెవడితోటో తిరగడం ఏమిటిరా? ఏదన్నా ప్రాణం విసిగితే ఎవడన్నా ఇలాంటి పని చేస్తాడు. అయినా ఎవడో వెధవ చేసిన ఫోన్‌కాల్సుని నమ్మడమేమిటిరా!" అంటున్న వినీత్‌ని చూస్తూ "అది కాదురా! ఇది మొదటిసారి కాదు. ఈ మధ్య వాడెవడితోటో క్యాంటీన్‌లకి వెళ్తోందనీ, నీకు విడాకులిచ్చి వాడిని పెళ్ళాడబోతోందనీ కూడా వదంతులొస్తున్నాయని ఫోన్ చేస్తున్నారు. ఈ యాక్సిడెంట్ అయిన కొత్తలో నాకు చేసినట్టు, చూసుకున్నట్టు ఇప్పుడు లేదురా. ఏదో మొక్కుబడిగా చేసి పడేస్తోంది– నువ్వడిగింది నిజమేరా, అర్చనని నేను చాలా మాటలు అంటున్నాను. నా బాధకొద్దీ రోజూ తిడుతున్నాను. అయినా ఎప్పుడూ జవాబు చెప్పేది కాదు. కానీ ఇప్పుడు మాటకి మాట జవాబు చెప్పి నన్నూ మాటలంటోంది. నిజంగా నాకు అర్చనంటే ప్రాణంరా! అదే నాకు విడాకులిస్తే నా గతేమిటిరా?" అంటూ గోలపెడుతున్న ప్రభుని చూస్తూ, "ఒరేయ్ ప్రభూ! అర్చన ఎలాంటి వ్యక్తో, ఎంత ఓర్మి, శాంతం గలదో మనందరికీ తెలుసు. నీ కోపమే ఆమెనలా మార్చిందేమో! పిల్లినయినా గదిలో పెట్టి కొడితే పులవుతుందంటారు. ఆలోచించు. అర్చనే లేకపోతే నీ బ్రతుకేమిటి? నీకెవరు చేస్తారు? ఆ ఫోన్‌కాల్సే నిజమయితే నీ గతేమిటి? నీవు నీ అనారోగ్యానికి ఆమెని బాధ్యురాలిగా చేసి హింసిస్తే, పాతికేళ్ళు నిండని అర్చన జీవితం గురించి ఆలోచించావా? ఉప్పూ కారం తినే వాళ్ళకి కోరికలుండవా? నీ నుంచి ఆమె జీవితాంతం నరకం అనుభవించడమే కాకుండా, నీ హింసలు కూడా తోడయితే ఏమవుతుంది? భరించలేక ఆ నిర్ణయం తీసుకుందేమో! బాగా ఆలోచించుకో– నీకింక దిక్కు అర్చనే!! ఇకనైనా ఆ విషయం తెలుసుకుని అర్చనతో ఆప్యాయంగా మసులుకో. ఆమెలో మార్పు వస్తుంది. అంతేగానీ ఇలా హింసిస్తే ఆమెకీ చిరాకొచ్చి, విసుగేసి, మొండికేస్తే నీ జీవితం ముందు ముందు నరకమే అవుతుంది" అంటూ చెప్తున్న వినీత్ మాటలకి ఆలోచనలో పడ్డ ప్రభు దగ్గర సెలవు తీసుకుని బయలుదేరాడు వినీత్.

ప్రభులో వచ్చిన మార్పుకి ధన్యవాదాలు తెలిపింది స్కూటర్ మీద దింపి వెళ్తున్న వినీత్‌కి అర్చన. "నాకు కాదు, డాక్టర్‌కి చెప్పాలి ధన్యవాదాలు. సైకోథెరపీలో ఇదో భాగం. దానికి నీ సహకారం కూడా తోడవడంతో పని సులువయింది" అంటూ నవ్వాడు వినీత్. ■

## చికిత్స

కంటికి వుంది చికిత్స
ఒంటికి వుంది చికిత్స
గుండెకీ, బండికీ వుంది చికిత్స
జీవితకాలం మరికొంత పొడిగించేందుకు వుంది
చికిత్స / ధనాశకు బానిసయి దురాశ ఊబిలో
కూరుకుపోతున్న ఈ మనిషి అంతర్యానికి మాత్రం
లేదు / ఏ శస్త్ర చికిత్స!

–వై. కె. మూర్తి